ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025 | 5 | అనంతపురం

రూ.3.03 కోట్లు విలువజేసే సెల్‌ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి-అనంతపురం

బాధితురాలికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ జగదీష్

వివిధ ప్రాంతాల్లో దొంగతనానికి గురై పోలీసుల ఛేదనలో దొరికిన రూ.3.03కోట్లు విలువజేసే 12,594 మొబైల్ ఫోన్లను బాధితులకు అనంత పోలీసులు అందజేశారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్ వీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు రికవరీ చేసిన వాటిలో దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లోని బాధితులకు వాటిని అందజేశామన్నారు. సెల్ ఫోన్ దుకాణం నిర్వాహకులు, ఇతరులెవరైనా అపరిచితులు అమ్మేఫోన్లను కొనుగోలు చేయొద్దన్నారు. ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు జవాబుదారీగా అందించేందుకు కృషి చేసిన జిల్లా పోలీస్ సైబర్ విభాగం సిఐ షేక్ జాకీర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఉమ్మడి అనంతలో కొత్త పరిశ్రమలు

◆ గార్మెంట్స్, ఎయిరో స్పేస్‌కు అనుమతులు
◆ రూ.1201.95 కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్త పరిశ్రమలకు అనుమతులను ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గార్మెంట్, ఎయిరో స్పేస్, డిఫెన్స్ పరిశ్రమలకు అనుమతులిచ్చిన వాటిల్లోనున్నాయి. రాప్తాడు, గుడిపల్లి, టేకులోడు, అనంతపురం జిల్లాలోని తిమ్మసముద్రం గ్రామాల్లో వీటి ఏర్పాటు జరుగనున్నాయి

రేమండ్స్

రాప్తాడు వద్ద రేమండ్స్ గార్మెంట్ పరిశ్రమకు సబ్సిడరీ సంస్థ స్పార్క్ అపెరెల్స్ ఏర్పాటుకు అనుతులిచ్చారు. 26.87 ఎకరాల్లో ఈ పరిశ్రమను స్థాపించనున్నారు. రూ.330 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టనున్నారు. ఎకరం రూ.20లక్షల రూపాయల చొప్పున భూములు కేటాయింపులు జరిగాయి.

ఎయిరో స్పేస్ పరిశ్రమ

చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద ప్రిసిషన్ ఇంజనీరింగ్ ఎయిర్ క్రాఫ్ట మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 29.57 ఎకరాల భూమిని ఇక్కడ కేటాయించారు. ఎకరం రూ.37లక్షల చొప్పున కేటాయింపులు జరిగాయి. రూ.256 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టనున్నారు.

గుడిపల్లి వద్ద మరొకటి..

సత్యసాయి జిల్లా గుడిపల్లి వద్ద ప్రిషిషన్ ఆటో పార్టు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి 24.39 ఎకరాలు భూములు కేటాయించారు. రూ.430 కోట్లు పెట్టుబులు పెట్టనున్నారు.

మూడు పరిశ్రమలు కలిపి మొత్తం రూ.1201.95 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. వీటి ద్వారా 6571 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. ఈ పరిశ్రమల ఏర్పాటు 2024 నుంచి 2032 వరకు వివిధ దశల్లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది.

తిమ్మసముద్రంలో డిఫెన్స్ పరిశ్రమ

అనంతపురం జిల్లా తిమ్మసముద్రంలో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతినిచ్చారు. జిఇన్‌ఫ్రా సంస్థ ఈ ప్రాంతంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. 121 ఎకరాల భూమిని ఈ పరిశ్రమకు కేటాయించనున్నారు. రూ.1150 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. త్రిపుల్ బేస్ ప్రొపెల్లెంట్, సింగిల్ బేస్ ప్రొఫెల్లెంట్, బయోమాడ్యుల్ ఛార్జింగ్ సిస్టమ్ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు.

గందరగోళంగా బదిలీల ప్రక్రియ

◆ అనంతలో ఉమ్మడి జిల్లాల సచివాలయ పరిపాలన అధికారుల బదిలీలు
◆ ఇరుకు భవనంలో ఇబ్బందులు
◆ మైకులో మాట్లాడుతున్నంతసేపు ప్రతిధ్వని
◆ ఖాళీలు చూపించడంలో స్పష్టత కరువు
◆ అనంత కార్పొరేషన్ పరిధిలో కాసేపు బ్రేక్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

జయమణెమ్మ కళ్యాణమండపంలో జరుగుతున్న బదిలీల కార్యక్రమం

అనంతపురం కేంద్రంగా ఉమ్మడి అనంత జిల్లాల సచివాలయ పరిపాలన అధికారుల బదిలీల ప్రక్రియ గందరగోళం నడుమ సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 12 మున్సిపాల్టీలకు సంబంధించి సచివాలయ పరిపాలన అధికారుల (అడ్మిన్స్) బదిలీల ప్రక్రియను శుక్రవారం నాడు అనంతపురం జీసస్ నగర్ జయమణెమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. 3 గంటలకు ప్రారంభం అవాల్సిన బదిలీల ప్రక్రియ గంట ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. కళ్యాణ మండపం చిన్నదిగా ఉండడంతో బదిలీల నిర్వహణ కోసం వచ్చిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు కనీసం కూర్చొనేందుకు కూడా స్థలం లేక ఇబ్బంది పడ్డారు. కనీసం కమిషనర్లు కూర్చొనేందుకు కూడా వేదిక లేకపోవడంతో కొందరు కిందనే కూర్చొన్నారు. మైకు ద్వారా మాట్లాడుతున్నంత సేపు కళ్యాణ మండలంలో మాటలు ప్రతిధ్వనించడంతో ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాక గందరగోళం నెలకొంది. అనంతపురం కార్పొరేషన్ కౌన్సిల్ హాలు పెద్దగా ఉన్నా అందులో బదిలీల ప్రక్రియ నిర్వహించకుండా వసతులు లేని కళ్యాణ మండపం అద్దెకు తీసుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లకు అద్దె ద్వారా లబ్ది చేకూర్చటానికే కళ్యాణమండపం వేదికగా ఎంపిక చేశారనే వాదనలు విన్పిస్తున్నాయి.

ఖాళీలపై స్పష్టత కరువు

బదిలీల ప్రక్రియ 3 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 4-30 గంటలు దాటినా మొదలవ్వలేదు. ఆయా సచివాలయాల పరిధిలోని ఖాళీలను స్పష్టంగా చూపకపోవడంతోనే బదిలీల ప్రక్రియ ఆలస్యం అయ్యింది. ఖాళీ స్థానాలను అక్కడ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాల్సి ఉంది. మున్సిపాలిటీల వారిగా ఖాళీల వివరాలను బోర్డు మీద ప్రదర్శించిన తర్వాత ఆప్షనల్ ఫారం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇదిజరగకుండానే గుంతకల్లు కమిషనర్ ఆప్షన్ పత్రాన్ని ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. ఇక ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాల్టీల లాగిన్ ఐడి అనంత కార్పొరేషన్ కమిషనర్ బాలస్వామి ద్వారానే వినియోగించే ఏర్పాటు చేశారు. ఒక్కరే ఈ పనులు చేయాల్సి రావడంతో తగినంత సమయం లేక సమస్యలు నెలకొన్నాయి. బదిలీల ప్రక్రియ ఆలస్యం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. రాత్రి ఇంటికెళ్లేందుకు బస్సులు లేక అనంతపురంలోనే ఉండాల్సి వచ్చింది. ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్వహించిన ఈ బదిలీల ప్రక్రియపై సచివాలయ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు.

అనంత కార్పొరేషన్ పరిధిలో బదిలీ ప్రక్రియకు కాసేపు బ్రేక్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల బదిలీ ప్రక్రియలో 15 పోస్టులను చేర్చకుండా నిలుపుదల చేయటంపై సచివాలయ యూనియన్ జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేషన్ బదిలీల ప్రక్రియను ఆపేశారు. ఆర్డీ ఆదేశాల అనంతరం నిలుపుదల చేసిన 15 పోస్టులను కలిపి రాత్రి 7-15 గంటల తర్వాత బదిలీ ప్రక్రియను ప్రారంభించారు. నగరంలోని ఒక సచివాలయం నుంచి మరో సచివాలయానికి మారడం వల్ల అక్కడ ఐదేళ్ల సర్వీసు పూర్తి కాలేదన్న సాకు చూపి 15 అడ్మిన్ సెక్రటరీల పోస్టులను బ్లాక్ చేసి ఉంచారు. గతంలో మాదిరిగా డేట్ అఫ్ జాయినింగ్‌ను బట్టి సర్వీసును లెక్కించాలి గానీ సచివాలయాల మారినంత మాత్రాన ఐదు ఏళ్ల సర్వీస్ పూర్తి కాలేదని పేర్కొనటం సరికాదని సచివాలయ యూనియన్ నాయకులు తెలిపారు. వీరి అభ్యర్థనపై ఆర్డీ సానుకూలంగా స్పందించడంతో ఆ 15 ఖాళీలతో కలిపి బదిలీ ప్రక్రియను మళ్లీ మొదటి నుంచి ప్రారంభించారు.

రీసోర్స్ పర్సన్‌కు ట్యాబ్ అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

మహిళా సంక్షేమానికి పెద్దపీట : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలన పథకం కింద కాలవ 42 మంది మెప్మా రీసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు, 23 మంది డిజి లక్ష్మీలకు బయోమెట్రిక్ పరికరాలు అందజేశారు. కాలవ మాట్లాడుతూ పట్టణంలో అసంఘటిత రంగంలో పని చేసే 11,852 మంది ఈ శ్రమ కార్డులు పొందారన్నారు. 13,740 మంది 42 మురికివాడల్లో స్థాయి సమాఖ్యలో సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. పొరాలు శిల్ప మాట్లాడుతూ ఆర్పీలు, డిజి లక్ష్మీలు ట్యాబ్‌లు, బయోమెట్రిక్ పరికరాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. మెప్మా టిఎంసి నారాయణరెడ్డి ఈ పరికరాల ఉపయోగాలను వివరించారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజి లక్ష్మి ద్వారా ఆన్‌లైన్‌లో అర్హులైన లబ్ధిదారుల వివరాలు నమోదు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంతి, నాయకులు గాజుల వెంకటేశులు, మహబూబ్‌బాషా, సంపత్ కుమారి, టంకసాల హనుమంతు, బండి భారతి, ధనార్జన, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఇనాయత్ బాషా పాల్గొన్నారు.

ఉత్తమ జిల్లాగా నిలుపుదాం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో అనంతపురం జిల్లా ఉత్తమ జిల్లాగా నిలవాలని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రాథమిక కార్యక్రమాల అమలును అధికారులు చిత్తశుద్ధితో చేయించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో సానుకూల అవగాహనపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ఆయా కార్యక్రమాల అమలులో అధికారుల పనితీరు, ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. అభివృద్ధి పనుల్లో వైఫల్యం ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, సర్వే శాఖ పరిధిలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ శాఖలో అధికారులు దీనిని మెరుగు పర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఒ ఎ.మాలోల, వఆవ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మునగ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని సెర్ప్ ఉన్నతి విభాగం డైరెక్టర్ పద్మావతి పేర్కొన్నారు. పట్టణంలోని దుర్గాదేవి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం జరిగిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు మునగ తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తమిళనాడులోని పెరునాకులంలో చూసి నేర్చుకున్న విషయాలు, అక్కడి రైతులు గడించిన లాభాల గురించి వివరించారు. అనంతరం పురా బిల్డింగ్(సిఎఫ్సి భవనం)ను సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, జీవనోపాధుల డైరెక్టర్ శంకర్, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గంగాధర్, సత్యసాయి జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ రామ్మోహన్, ఎంపిడిఒ కొండన్న పరిశీలించారు. వారి వెంట ఏసి గోవిందప్ప ఉన్నారు.

"రీకాలింగ్ బాబు"తో ఇంటింటి ప్రచారం

వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

"రీకాలింగ్ బాబు" క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న సజ్జల, మిథున్‌రెడ్డి తదితరులు

ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేశారని, దీనిని ప్రజలకు తెలియజేసేందుకు వైసిపి ఆధ్వర్యంలో 'రీకాలింగ్ బాబు' మేనిఫెస్టో పేరుతో ఇంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వైసిపి నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు వైసిపి రాయలసీమ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో కలిసి అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కేంద్రంలో పర్యటించారు. బుక్కరాయసముద్రంలో వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. "రీకాలింగ్ బాబు" మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సజ్జల మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ లేదన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకు ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇస్తానని చెప్పిన హామీ ఏమైందన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా కూటమి పాలన సాగుతోందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడమే చంద్రబాబు పాలనలా ఉందన్నారు. హామీలు అమలు చేయని ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలన్నారు. రీకాలింగ్ చంద్రబాబు పేరిట చేపట్టిన కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ.. కుటుంబానికి ఎంత మోసం జరిగిందో తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షులు ఉషశ్రీచరణ్, అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల నియోజకర్గం సమన్వయకర్త సాకే శైలజనాథ్, జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, బుక్కరాయ సముద్రం జడ్పిటిసి భాస్కర్, నాయకులు పూల నారాయణస్వామి, గువ్వల శ్రీకాంత్ రెడ్డి, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, గువ్వల పెద్ద వెంకటరెడ్డి, అంకె నరేష్, వెంకట శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రికి మీరైనా చెప్పండి'

ఎన్టీఆర్ విగ్రహానికి వినతి అందించి ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

'మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు రూపాల్లో ఆందోళనల్లో చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. తమ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మీరైనా చెప్పండి' అంటూ కార్మికులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు విగ్రహానికి వినతిని అందించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురంలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు చేపట్టారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగునంగా కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలన్నారు. కార్మికులు చేసే పనులకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, పోతులయ్య, తిరుమలేష్ పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో 'నగదు బదిలీ'ని వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజా పంపిణీ వ్యవస్థలో పేదల ఆకలి తీర్చే రేషన్ సరఫరా స్థానంలో నగదు బదిలీ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, సర్వేలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో శుక్రవారం సిపిఎంకు సంబంధించి రాయదుర్గం, కణేకల్లు, డి.హీరేహాల్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో అనేకమంది పేదలు పౌష్టికాహార లోపంతో బాధపడుతుండగా ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందించే నిత్యావసర సరుకుల స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు నగదు బదిలీ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్యూఆర్ సర్వే ఆధారంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా కేంద్రం నగదు బదిలీ విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నించగా ప్రజల తిరుగుబాటు వల్ల ఆగిపోయిందన్నారు. అయితే తిరిగి కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే సాకు చూపి రేషన్ స్థానంలో నగదు బదిలీ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలు ఈ విధానం ద్వారా బయట దుకాణాల్లో నిత్యావసర సరుకులు కొనేందుకు ఇబ్బంది పడతారన్నారు. ఇది ఓ వైపు రైతాంగాన్ని, ఎఫ్‌సిఐ ద్వారా ధాన్యం సేకరణను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న క్యూఆర్ కోడ్ సర్వేను ప్రజలు వ్యతిరేకించాలని నల్లప్ప విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, ఆయా మండలాల కార్యదర్శులు ఎన్.లోకేష్, కోరి నాగరాజు, నాయకులు మధు, తిమ్మరాజు, శంకర్, రమేష్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వంశీకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున. తదితరులు పాల్గొన్నారు.

రేపు కామ్రేడ్ లక్ష్మన్న స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎస్‌టియూ సీనియర్ నాయకుడు, కామ్రేడ్ లక్ష్మన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ నెల 29వ తేదీ కుందుర్పిలో నిర్వహించే స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి హాజరవుతున్నారన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు నరసింహులు, నాగరాజునాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, బుడెన్, రామదాసు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని వినతి

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పనిభారం తగ్గించాలని, లేనిచో సామూహిక సెలవులకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. సచివాలయాల్లో విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పంచాయతీ కార్యదర్శులు శ్రీదేవి, భీమేష్, తదితరులు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయాలకు డిడిఒలుగా ఉన్న కారణంగా సర్వే పని భారం తమపై పడుతుందన్నారు. వివిధ శాఖల సమస్యలపై కార్యదర్శి ఫీడ్ బ్యాక్‌కు వెళ్లినప్పుడు సదరు సబ్జెక్ట్ మీద ప్రజలకు అవగాహన లేకపోవటం, ఆయా శాఖలు చేస్తున్న పరిష్కారాలతో సంతృప్తి చెందక వారు కార్యదర్శిని దూషించడం, ఇతరత్రా కారణాలతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘంతో చర్చించి మండలం కార్యదర్శుల సంఘం ఏకగ్రీవంగా సామూహిక సెలవుల కోసం విజ్ఞప్తి చేస్తున్నట్లు వివరించారు. వినతి ఇచ్చిన వారిలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ పాల్గొన్నారు.

గూగూడు ఉత్సవాలు ప్రారంభం

నేడు కుళ్లాయిస్వామి తొలి దర్శనం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గుగూడు కుళ్లాయి స్వామి బ్రహోత్సవాలు శుక్రవారం నాడు ప్రారంభం అయ్యాయి. శనివారం ఉదయం కుళ్లాయిస్వామి తొలిదర్శనం ఇవ్వనున్నారు. జూలై 9వ తేదీ సాయంత్రం స్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 4న చిన్న సరిగెత్తు, 6న పెద్ద సరిగెత్తు, 7న అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం కుల్లాయి స్వామి జలధి కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. చలివేంద్రాలు, తాత్కాలిక విశ్రాంతి గుడారాలు, మరుగుదొడ్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ కోరారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో బిసి కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎంపిడిఒ విజయభాస్కర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు ఈ కుట్టు శిక్షణ కేంద్రాల ద్వారా నైపుణ్యం పెంపొందించుకుని స్వయం ఉపాధి పొందవచ్చున్నారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారికి బిసి కార్పొరేషన్ తరపున కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని ఎన్‌జిఒ కోఆర్డినేటర్ పార్వతి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దాస్, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు

రాయదుర్గం ఎడిఏగా పద్మజ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఎడిఎ)గా పద్మజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ రాయదుర్గం డివిజన్ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈమె ఉరవకొండ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎడిఏగా పనిచేస్తున్న లక్ష్మానాయక్ ధర్మవరం పట్టణానికి బదిలీ అయ్యారు.

నేడు శ్రీధర్స్ సిసిఇ ఆధ్వర్యంలో సక్సెస్ మీట్

హాజరుకానున్న ఎస్పీ జగదీష్

విలేకరులతో మాట్లాడుతున్న శేషకుమార్, అరవింద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని కమలానగర్‌లో ఉన్న శ్రీధర్స్ సిసిఇ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక లలిత కళా పరిషత్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ శేష్‌కుమార్, అరవింద్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ ప్రతిఏటా తమ సంస్థ ద్వారా బ్యాంకింగ్, వివిధ పోటీతత్వ కాంపిటీషన్ పరీక్షల్లో సత్తా చాటి ఉపాధి పొందిన అభ్యర్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2024లో బ్యాంకింగ్ రంగంతోపాటు వివిధ సంస్థలలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను సన్మానించేందుకు సక్సెస్ మీట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 300 మంది అభ్యర్థులను సన్మానించనున్నట్లు చెప్పారు

పెద్దాసుపత్రి నగర కమిటీ ఎన్నిక

నూతన కమిటీ సభ్యులతో యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఎపి మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలుగా నల్లమ్మ, ప్రధాన కార్యదర్శులుగా నాగలక్ష్మి, కోశాధికారిగా కళావతి, కమిటీ సభ్యులుగా దుర్గాప్రసాద్, శేఖర్, వన్నూరప్ప, శివకుమార్, సంజీవ్‌కుమార్, బి.లక్ష్మీ, రమాదేవి, మల్లికా, గౌసియా, రమా, బిబి, కాంతమ్మ, సుబ్బమ్మ, యల్లమ్మ, ప్రమీల, జుబేదా, ఎస్.లక్ష్మీ, పద్మావతి, ఓబులమ్మను ఎన్నుకున్నారు. అనంతరం కామ్రేడ్ శేఖర్ అధ్యక్షతన ప్రభుత్వ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ముర్తుజా, ఉపాధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ కార్మికులకు సిఐటియు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్మికులందరూ ఐక్యమత్యంతో తమ హక్కులు సాధించుకునేందుకు అలుపెరుగని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుడు బత్తల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కేబుల్ వైర్లను మార్చాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక సిఐటియు కాలనీలో తెగిపడిపోతున్న విద్యుత్ కేబుల్ వైర్లను మార్చాలని సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎడిఎ నాగేంద్రకు సిఐటియు కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సిఐటియు కాలనీ ఏర్పడి 25 ఏళ్లు అవుతోందన్నారు. కాలనీ ప్రారంభంలో వేసిన విద్యుత్ కేబుల్ వైర్లు పాతబడటంతో నిరంతరం తెగి కింద పడిపోతున్నాయన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. వాటిస్థానంలో కొత్త వైర్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. అలాగే విద్యుత్ కోతలను నివారించేందుకు మరో ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్లా, కాలనీ కమిటీ నాయకులు రామయ్య, రవి, షబ్బీర్, నాగరాజు, సమీర్, సాయి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


ఫర్టిలైజర్ దుకాణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-పామిడి

ఫర్టిలైజర్ దుకాణం ద్వారా వినియోగదారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎద్దులపల్లి రోడ్డు పరిసర ప్రాంతంలో వైసిపి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డికి ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ దుకాణాన్ని వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫర్టిలైజర్స్ దుకాణం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. అనంతరం పెమ్మక చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులను సరసమైన ధరలకే సరఫరా చేస్తామన్నారు. అనంతరం వెంకట్రామిరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, మూలింటి నాగేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కొండూరు బబ్లూ, సుధాకర్, నరసింహ, నక్కా నారప్ప, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి పథకం పనులు

పనులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో ఉరవకొండతో పాటు మరో ఏడు గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉరవకొండతోపాటు గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా నిధులను విడుదల చేయించి తాగునీటి పథకం పనులను వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఉరవకొండ మండలంలోని నింబగల్లు గ్రామం వద్ద తాగునీరు అందించే తాగునీటి పథకం పైప్‌లైన్ ఏర్పాటు కోసం ఫిల్టర్ బెడ్లు సిద్ధం చేశారు. దీనికితోడు ఇందులో ఏర్పాటు చేసేందుకు మైక్రో ఫిల్టర్స్ ఇప్పటికే చేరుకున్నాయి. అలాగే పిఎబిఆర్ జలాశయం నుంచి ఉదిరిపికొండ, ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ పట్టణానికి తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి అయి ఇప్పటికే ట్రయల్ రన్‌ను పూర్తి చేశారు. ఆయా పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఐజయ్య, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

5న జాతీయ లోక్‌అదాలత్

గుత్తి : వచ్చేనెల 5 తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా ఆరవ అదనపు న్యాయస్థానంలో శుక్రవారం న్యాయవాదులు, పోలీస్, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారుల కేసులను వీలైనంత అధిక సంఖ్యలో పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పీడీ రత్నం, ఎజిపి ఫక్రుబాషా, సీనియర్ న్యాయవాదులు జెడ్ సతీష్, ఎ.రామ్మోహన్‌రెడ్డి, సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సిఐ కె.ఉమాదేవి, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

యాడికి : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రుద్రమనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ పంపిణీని సులభతరం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎండియు వాహనాల ద్వారా ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. వాటిని రద్దు చేసి రేషన్ పంపిణీని సులభతరం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వికలాంగులు, వృద్ధుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్‌షాపు డీలర్లు నరసింహచౌదరి, తాండ్ర విక్రమ్, తెలుగు యువత నాయకుడు నీలకంఠారెడ్డి, ఆదినారాయణ, వెంకటేష్, బాలు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం తగదు : టిడిపి

కళ్యాణదుర్గం టౌన్ : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ చట్టం గురించి వైసిపి నేతలకు ఏమి తెలుసని టిడిపి లీగల్ సెల్ నాయకుడు దేవేంద్ర, ముత్యాలు, సుదర్శన్, దిలీప్ ఎద్దేవా చేశారు. పట్టణంలోని బార్ అసోషియేషన్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ స్టాంపుల వ్యవహారానికి కారణమైన మీసేవ బాబు తన మనుగడ కోసం గతంలో వైసిపి ప్రజాప్రతినిధులను అడ్డు పెట్టుకుని అక్రమాలకు తెరలేపాడన్నారు. ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు చేసే అవినీతికి ఎమ్మెల్యే ఎలా బాధ్యుడవుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అవినీతికి పాల్పడాల్సిన అవసరం లేదని, అవినీతి చేసే వారు తన వారైనా సహించడన్నారు. అసత్య ప్రచారాలతో ఎమ్మెల్యేపై బురదజల్లే వారిపై న్యాయంగా పోరాడుతామన్నారు. ప్రజలను తప్పు దోవ పట్టించి లబ్ధి పొందాలని ప్రయత్నించడం అవివేకమన్నారు.

'ఉపాధి' కూలీలపై నిర్లక్ష్యం తగదు

వ్యకాసం ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ కూలీలకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని మోపిడి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించి శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు దాదాపు 7, 8 వారాల నుంచి బిల్లులు చెల్లించలేదన్నారు. అన్నివారాలు బిల్లులు చెల్లించకపోతే కూలీలు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. పనులు చేసిన ఉపాధి శ్రామికులకు ప్లే స్లిప్పులు, పనిముట్లు ఇవ్వాలని, పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, మేట్‌లకు పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురళి, మండల నాయకులు సిద్ధప్ప, వీరాంజనేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాదాపు ఏడెనిమిది వారాల బిల్లులు చెల్లించకపోతే కూలీలు ఏం తిని బతకాలన్నారు. అలాగే పనులు చేసే చోట కనీస వసతులు కల్పించడం లేదన్నారు. ప్రతివారం చేసిన పనులకు 14రోజుల్లోపు బిల్లులు చెల్లించాలన్నారు. పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లు, పే స్లిప్పులు ఇవ్వాలని, మేట్లకు పారితోషికం చెల్లించాలని, ప్రతి జాబ్‌కార్డుకు 200 రోజులు పనులు కల్పించి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా వంద రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు నిర్వహిద్దాం

ఏర్పాట్లను పరిశీలించిన ఎంపి అంబికా

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి అంబికా, అధికారులు

ప్రజాశక్తి-నార్పల

గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కుళ్లాయిస్వామి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం గూగూడు గ్రామాన్ని సందర్శించిన ఎంపి అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా పార్కింగ్ ఏరియాలు, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం, జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీలను పరిశీలించారు. గ్రామమంతా పర్యటించి అధికారులకు సలహాలు, సూచనలు అందజేశారు. ట్రాఫిక్ నియంత్రణలో తీసుకోవాల్సిన చర్యలను డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై ఆలయ ఇఒ శోభను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు గారు, జాఫర్‌వలి, నరసింహులు, రాజన్న, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కాగా శుక్రవారం ఉదయం ఎంపిడిఒ మమతాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్ కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా కల్యాణ కట్ట నుంచి వంక వరకూ జెడ్పీ నిధులతో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణం, సురక్షిత తాగునీటి ప్లాంట్ నిర్మాణం, పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అలాగే మండల పరిషత్ నిధులతో ఐదు చేతిపంపులకు మరమ్మతులు చేపట్టారు. అలాగే గ్రీన్ షెడ్ నెట్టు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ స్థలాలు, తదితర వాటిని ఎస్ఐ సాగర్ పరిశీలించారు.

కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. పది రోజులుగా నియోజకవర్గం టిడిపి సంస్థాగత కమిటీల నియామకంపై కసరత్తు అనంతరం శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కె.తిమ్మయ్య చౌదరి, సంస్థాగత కమిటీల ఎన్నికల పరిశీలకులు టి.తులసిరెడ్డి,పర్వీన్ భాను, పర్వతనేని శ్రీధర్‌బాబు, కేశవరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పది రోజులుగా నియోజవర్గ పార్టీ సంస్థాగత కమిటీల నియామకం కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణ, మండలాల పార్టీ సంస్థాగత కమిటీల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిటీలను ఎంపిక చేశారన్నారు. గుంతకల్లు పట్టణ అధ్యక్షులుగా ముక్కన్న గారి గుణశేఖర్, మండల అధ్యక్షులుగా రామన్న చౌదరి, గుత్తి పట్టణ, మండల అధ్యక్షులుగా ఎంకె.చౌదరి, ఎస్.బద్రివలి, పామిడి పట్టణ మండలాల అధ్యక్షులు బొమ్మా మోహన్‌కృష్ణ, పి.సురేష్‌రెడ్డిని ఎంపిక చేశారు. అదేవిధంగా గుంతకల్లు పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులుగా ఫజులూర్ రెహ్మాన్, శోభన్‌బాబు, గుత్తి పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులుగా ప్రసాద్, పల్లా సాంబశివయ్య, పామిడి పట్టణ మండలాల ప్రధాన కార్యదర్శులుగా రాము, పి.రామాంజినాయక్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు. కమిటీల నియామకంలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఆశావాహులందరినీ ఏకతాటిపైకి తెచ్చి వారి ఏకాభిప్రాయంతో కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఎన్నికైన వారందరూ కూడా అందరినీ కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంటే జీర్ణించుకోలేని వైసిపి అధినేత జగన్, అతని అనుచరగణం నాయకులు బురదజల్లేందుకు యత్నిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధాటికి వైసిపి గల్లంతు అవుతుందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కురుబ చంద్రశేఖర్, ముక్కన్న గారి రామాంజినేయులు, ప్రతాప్‌నాయుడు, సర్పంచు శ్రీరాములు, మస్తానప్ప, నందీశ్వర్, చిప్పగిరి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి టిడిపి పట్టణ,మండల అధ్యక్షులుగా ఎంకె.చౌదరి, బద్రివలి

పట్టణ కన్వీనర్ ఎంకె.చౌదరి

మండల కన్వీనర్ బద్రివలి

గుత్తి : టిడిపి పట్టణ, మండల అధ్యక్షులుగా ఎంకె చౌదరి, ఎస్.బద్రివలి ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యదర్శులుగా ప్రసాద్, పల్లా సాంబశివయ్య ఎంపికయ్యారు. ఇటీవల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఆధ్వర్యంలో టిడిపి ఎన్నికల పరిశీలకులు పర్వీన్ భాను, చిత్రచేడు విశాలాక్షి, గంజే నాగరాజు టిడిపి కమిటీల ఏర్పాటుకు ఆశావాహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించిన అధిష్టానం పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు.

సంతకం చేస్తున్న శాప్ డైరెక్టర్ శివ

శాప్ డైరెక్టర్‌గా శివ ప్రమాణ స్వీకారం

అనంతపురం కలెక్టరేట్ : విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్‌గా అనంతపురం తెలుగు యువత నగర అధ్యక్షుడు బొమ్మినేని శివ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో క్రీడా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రమాణం చేయించారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు బొమ్మినేని శివ కృతజ్ఞతలు తెలిపారు.

ఐదురోజులు గాలులతో కూడిన జల్లులు

బుక్కరాయసముద్రం : అనంతపురం జిల్లాలో రాబోవు ఐదు రోజులపాటు అధిక గాలులలతో కూడిన చిరుజల్లులు, పలుచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని విశాఖపట్టణం వాతావరణ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.. గరిష్ట ఉష్ణోగ్రత 34.0-36.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 24.2-25.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ ఉదయం 66-68, మధ్యాహ్నం 42-43 శాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. కావున ఆయా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అనంతపురం వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ వాతావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త జి.నారాయణస్వామి, మెట్ట వ్యవసాయం ప్రధాన శాస్త్రవేత్త ఎం.విజయ్ శంకర్‌బాబు, రీసెర్చ్ అసోసియేట్ అధిపది జిడి ఉమాదేవి తెలిపారు.

జోనల్ లెవెల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిషాన్‌ఖాన్ ఎంపిక

అనంతపురం : జోనల్ లెవెల్ ఛాంపియన్‌షిప్ కాంపిటీషన్స్‌కు అనంతపురం ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థి జిషాన్‌ఖాన్ ఎంపికయ్యాడు. 25వ ఆంధ్రప్రదేశ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ కాంపిటీషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన కాంపిటీషన్‌లో జిషాన్‌ఖాన్ పిస్టల్ సబ్ యూత్ విభాగంలో అర్హత సాధించి జోనల్ లెవెల్ ఛాంపియన్‌షిప్ కాంపిటీషన్స్‌కు ఎంపికైనట్లు కోచ్ శ్రీకాంత్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గుత్తి : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ డి.ప్రభాకర్‌కు పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ తమకు పనిభారం పెరిగిందన్నారు. సచివాలయాలకు సంబంధించి పలు సర్వేలు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో చాలామంది పంచాయతీ కార్యదర్శులు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్,ఎర్రిస్వామి, బోయ వెంకటేష్, ధనలక్ష్మి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి గ్రామంలో బాల్య వివాహాలు, లింగవివక్షపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్ఇఒ పర్వీన్ లింగ వివక్షత, బాల్య వివాహాల రద్దు, చట్టాలు, చిన్న వయసులో వివాహాలతో గర్భం ధరించడం వచ్చే ఆరోగ్య సమస్యలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్ వైజర్ ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ కేశవయ్య, ఎంఎల్‌హెచ్‌పి అశ్విని, ఎఎన్ఎంలు కవిత, ఆదిలక్ష్మి, అంగన్వాడీ టీచర్, హెల్పర్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జల, మిథున్‌రెడ్డిని కలిసిన రవికుమార్‌నాయక్

శింగనమల : బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన నియోజకవర్గ వైసిపి కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన వైసిపి ముఖ్యులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిని మండలానికి చెందిన ఎం.రవికుమార్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల : మండల పరిధిలోని కల్లుమడి సబ్‌సెంటర్ కింద ఏకులనాగేపల్లి గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు ఈనెల 30వతేదీలోపు తమ దరఖాస్తులను తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందజేయాలన్నారు.

వైసిపి మండల కన్వీనర్ల ఎంపిక

బక్కరాయసముద్రం కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం : వైసిపి మండల అధ్యక్షులుగా గువ్వల శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో వైసిపి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటామని తెలిపారు.

నార్పల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్

నార్పల : మండల వైసిపి కన్వీనర్‌గా మాజీ సర్పంచు ఖాదర్ వలీఖాన్‌ను ఎంపిక చేశారు. ఈమేరకు కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా ఖాదర్ వలీఖాన్ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్, సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా వెంకట రమణయాదవ్

పుట్లూరు : వైసీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శిగా మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన బుసగాని వెంకట రమణ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త శైలజానాథ్, ఎన్ఆర్ఐ వింగ్ కో- ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరవకొండ ఎడిఎ బాధ్యతల స్వీకరణ

ఉరవకొండ : ఉరవకొండ డివిజన్ అగ్రికల్చర్ ఎడిఎగా ఎస్.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సత్యసాయి జిల్లా కదిరిలో ఎడిఎగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఉరవకొండకు వచ్చారు. ఈ సందర్భంగా ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండలాల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, హెచ్.పెన్నయ్య, లీనా వసుంధర, మధుకర్, తదితరులు ఎడిఎ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. సన్మానించిన వారిలో ఎఇఒ భరత్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ నేత ఫక్రుద్దీన్‌కు నివాళి

అనంతపురం సిటీ : నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు హనిగి శర్మాస్‌వలి అధ్యక్షతన ఫక్రుద్దీన్‌కు శుక్రవారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కాపు గాజుల వాసు, రామచరణ్ యాదవ్, హరి, మురళి, అబ్బాస్, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

గుత్తి : గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆదాయంపై సర్పంచులు దృష్టి సారించాలని ఎంపిడిఒ డి.ప్రభాకర్, శిక్షకులు రామాంజనేయులు, ఓబిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సర్పంచులకు జరుగుతున్న శిక్షణ రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు గతంలో చేపట్టిన ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో చేపడితే అభివృద్ధి జరుగుతుందన్నారు. తరచూ గ్రామాల్లోని ప్రాంతాలను సందర్శిస్తే సమస్యలపై అవగాహన కలుగుతుందన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పామిడి : మండల కేంద్రంలోని వెలసిన వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాఖంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాతృమండలి అధ్యక్షులు ఎన్‌విఎస్ నాగవల్లి, కార్యదర్శి కీర్తి, గౌరవాధ్యక్షులు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుత్తి : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డి.ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అభివద్ధి పనులుతో పాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

బోడాయిపల్లిలో ఘర్షణ

బెడిసి కొట్టిన రాజీయత్నం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి నియోజకవర్గంలోని బోడాయిపల్లి ఘర్షణ చోటు చేసుకుంది. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బోడాయిపల్లికి చెందిన చిన్న కుల్లాయప్ప, అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడగా మహిళ చేసిన ఫిర్యాదు మేరకు ఇద్దరినీ స్టేషన్‌కు పిలిపించి పంచాయితీ చేశారు. ఈ పంచాయితీలో చిన్న కుల్లాయప్పకు గ్రామంలోకి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఒప్పుకున్న చిన్న కుల్లాయప్ప మౌనంగా వెళ్లిపోయారు. ఇంత వరకూ బాగానే ఉంది. అయితే ఉన్నఫలంగా శుక్రవారం చిన్న కుల్లాయప్ప తన వ్యవసాయ పొలంలో పనుల నిమిత్తం మందీమార్బలంతో పొలంలోకి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చిన్న కుల్లాయప్పను ఎందుకొచ్చావంటూ నిలదీశారు. దీంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని చెదరగొట్టారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ శివగంగాధర్ రెడ్డి తెలిపారు.

మట్కా నిర్వాహకురాలు అరెస్టు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సిఐ సాయిప్రసాద్

తాడిపత్రి : మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు మహిళలను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ సిఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బస్టాండ్ ముందు మున్సిపల్ ఫుట్‌పాత్‌పై మట్కా నిర్వహిస్తున్న దూదేకుల కుల్లాయమ్మను అదుపులోకి తీసుకుని రూ.5లక్షలు, దాస్తి సరస్వతిని అదుపులోకి తీసుకుని రూ.6.50లక్షలు, జ్యోతిని అదుపులోని తీసుకుని రూ.15వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి ఏడు మట్కా పట్టీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట జూదరులు...

బెలుగుప్ప : మండల పరిధిలోని గుండ్లపల్లి సమీపంలో కొండగుట్టలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రూ.4250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి నిందితులతోపాటు నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. 13 మంది టీచర్లకు గాయాలు

బోల్తా పడిన వాహనం

ఉరవకొండ : ఉరవకొండ మండలం కోనాపురం వద్ద శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో 11 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.